www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
16.10.2026

నేడు వేపకాయల బతుకమ్మ



ఇది ఆశ్వయుజ మాసంలో 7వ రోజు. ఈ రోజున వేపకాయల బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మను తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబి పూలతో ఏడంతారాలుగా పేర్చి ఆడుకొని చెరువులో వేస్తారు. ఈ రోజున బతుకమ్మకు బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్ల ఆకారంలో తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

రాష్ట్రంలో ముంచుకొస్తున్న ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్లోబల్ వార్మింగ్ విపత్తు కరోనా కంటే తీవ్రమైనదని, వచ్చే పది నెలల పాటు ప్రజలు, అన్నదాతలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయినందున ఈ సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేస్తూ, క్లిష్ట పరిస్థితుల్లో రాజకీయ విమర్శలు మాని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

కలంజ్యోతి బ్యూరో.. 2 లో..

కరోనాను మించిన పెనువిపత్తు ఎల్ నినో



- ఎల్ నినోపై అప్రమత్తత అవసరం
- ఆరుతడి పంటలే ముద్దు
- రికార్డు స్థాయికి చేరిన విద్యుత్ డిమాండ్
- ఉపాధి హామీతో చెరువుల పునరుద్ధరణ
- ప్రభుత్వానికి సహకరించాలి


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తీరొక్క పూలతో గౌరమ్మను పేర్చి ఆరాధించే పువ్వుల పండుగ బతుకమ్మకు సరికొత్త రూపమిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తింది. రవీంద్రభారతిలో నిర్వహించిన అధికారిక వేడుకల్లో ఏకంగా బతుకమ్మ తల్లి అంటూ ఒక ఫోటోను పెట్టి పూజలు చేయడం చూసి రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. తెలంగాణ చరిత్రలోనే బతుకమ్మ తల్లి ఫోటోను చూడటం ఇదే మొదటిసారంటూ జనం నవ్వుల పూలు పూయిస్తున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలపై కనీస అవగాహన లేకుండా, ప్రకృతిని కొలిచే పండుగను ఇలా ఫోటోల మాయగా మార్చేయడం కాంగ్రెస్ మార్కు వింత పోకడలకే చెల్లిందని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

స్కంద మాతగి బాసర అమ్మవారు

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 15) : దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని రోజుకు అలంకారంలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఐదో రోజున అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే వేద పండితులు, పూజారులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. స్కందమాత కు ప్రీతిపాత్రమైన పెరుగన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించేందుకు తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు వచ్చారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శుక్రవారం 16.10.2026
www.kalamjyothi.com



కరోనాను మించిన పెనువిపత్తు ఎల్ నినో

కలంజ్యోతి బ్యూరో (అక్టోబర్ 16) : ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదని, ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా దాదాపు 100 దేశాలపై ఎల్ నినో ప్రభావం ఉందని ఐక్యరాజ్యసమితి, శాస్త్రవేత్తలు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తుచేశారు. గత 75 ఏళ్లలో ఎన్నోసార్లు ఎల్ నినో వచ్చినా, ఈసారి ప్రభావం వాటన్నింటినీ మించి ఉంటుందని, ఇది కరోనా కంటే పెనువిపత్తుగా పరిణమించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎనిమిది నుంచి పది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్ నినో పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేశామని, నోడల్ అధికారిగా కె.రామకృష్ణారావును నియమించినట్లు వెల్లడించారు.

వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు..

గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీరుండగా, ప్రస్తుతం 209 నుంచి 290 టీఎంసీలకే పరిమితమైందని ముఖ్యమంత్రి తెలిపారు. డబ్బులిచ్చి ఎంత ఇష్టపడినా నీటిని కొనుగోలు చేయలేమని, అందుబాటులో ఉన్న జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును ఈ ఒక్క సీజన్ పక్కనపెట్టి, తక్కువ నీటితో పండే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని కోరారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల మార్పిడికి అలవాటు పడాలని సూచించారు.

రికార్డు స్థాయికి చేరిన విద్యుత్ డిమాండ్..

రాష్ట్రంలో తీవ్రమైన ఎండల కారణంగా విద్యుత్ వినియోగం అసాధారణ రీతిలో పెరిగిందని రేవంత్ రెడ్డి వివరించారు. గతంలో 13 నుంచి 14 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్, ప్రస్తుతం చరిత్రలోనే తొలిసారిగా ఏకంగా 20,003 మెగావాట్ల గరిష్ట స్థాయికి చేరిందని పేర్కొన్నారు.

పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్‌లలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో రైతుల పంటలు ఎండిపోకూడదనే ఉద్దేశంతో మార్కెట్‌లో ఎంత భారమైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామన్నారు. సంక్షోభ సమయంలో అదనపు విద్యుత్‌ను సబ్సిడీ ధరకు కేటాయించాలని, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర వాటాను పెంచి రాష్ట్రాలకు అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు.

ఉపాధి హామీతో చెరువుల పునరుద్ధరణ..

ఎల్ నినో విపత్తు నుంచి గ్రామీణ పేదలు, కూలీలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షల మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

భవిష్యత్తులో వర్షాలు కురిసినప్పుడు నీరు సమృద్ధిగా నిల్వ ఉండేందుకు వీలుగా చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నామని వివరించారు. ఎల్ నినో నష్టాలను అధిగమించడానికి కేంద్రం నుంచి అవసరమైన నిధులు, సహాయం పొందడానికి సమగ్ర నివేదిక రూపొందిస్తున్నామని, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో కూడిన అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

రాజకీయాలు మాని ప్రభుత్వానికి సహకరించాలి..

రాష్ట్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే కొందరు పైశాచిక ఆనందం పొందుతూ సంక్షోభ పరిస్థితులపై చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. కోవిడ్ వ్యాప్తి సమయంలో ప్రజలంతా ఏ విధంగానైతే కలిసికట్టుగా పోరాటం చేశారో, దీపాలు వెలిగించి, ప్లేట్లు కొట్టి స్పందించారో.. అదే విధమైన బాధ్యతను, సంయమనాన్ని ప్రస్తుత ప్రకృతి విపత్తు వేళ కూడా అన్ని పార్టీలు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలు మాని, ప్రజల క్షేమం కోసం ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.



ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- సినిమా థియేటర్ల ప్రారంభోత్సవాలకేనా ప్రాధాన్యం
- కరెంటు కష్టాలతో అన్నదాతల కన్నీళ్లు
- హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థుల అవస్థలు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 15) : ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు ఒక్కరోజైనా తమ సమస్యలపై దృష్టి సారించాలని సామాన్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నో సమస్యలతో పేదలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సినిమా థియేటర్ల ప్రారంభోత్సవాలు, వ్యాపార సంస్థల కార్యక్రమాలు, ప్రైవేటు వేడుకలకు ఇచ్చే ప్రాధాన్యతను నిరుపేదల సమస్యల పరిష్కారానికి కూడా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారికి ప్రముఖులు, వీఐపీలను ఆహ్వానించుకునే అవకాశాలు ఉంటాయని, నిరుపేదలకు కష్టమొస్తే భరోసా కల్పించాల్సింది ప్రజాప్రతినిధులేనని గుర్తుచేస్తున్నారు.

హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థుల అవస్థలు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వచ్చే నిరుపేదల అవస్థలను, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను ప్రజాప్రతినిధులు స్వయంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఉడకని అన్నం, సరిగా ఉడకని కూరలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులపై తక్షణమే దృష్టి సారించి పరిష్కరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాప్రతినిధులు ఏ ఒక్క వర్గానికో పరిమితం కాకుండా అందరికీ అందుబాటులో ఉండాలని, వ్యాపార కార్యక్రమాలకు కేటాయించే సమయంలో కొంతైనా ఆస్పత్రులు, హాస్టళ్లలో గడిపితే వాస్తవ పరిస్థితులు క్షేత్రస్థాయిలో తెలుస్తాయని పేర్కొంటున్నారు.

కరెంటు కష్టాలతో అన్నదాతల కన్నీళ్లు..

విద్యుత్ సరఫరా లోపాలతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమని, అన్నదాతల కన్నీటి గాథలను వినేందుకు కొంత సమయమైనా కేటాయించాలని రైతాంగం కోరుతోంది. తమకు పెద్దపెద్ద హామీలు అవసరం లేదని, కష్టాలు వినే ఓపిక, సమస్యలు పరిష్కరించే చొరవ ఉంటే చాలని సామాన్యులు వేడుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు ఒక్కసారి తమ వైపు చూసి బాధలు విని భరోసా కల్పించాలని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపినప్పుడే నాయకులపై విశ్వాసం మరింత పెరుగుతుందని పలువురు స్పష్టం చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- రెగ్యులరైజ్ చేస్తామన్న హామీ ఏమైంది
- పెండింగ్ వేతనాలు ఇచ్చి భద్రత కల్పించాలి
- ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 15) : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎన్నికల సమయంలో చాయ్ తాగినంత సమయంలోనే ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న సిబ్బంది హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం శోచనీయమన్నారు.

పెండింగ్ వేతనాలు ఇచ్చి భద్రత కల్పించాలి..

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఎన్‌హెచ్ఎం సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ఎం, ఆయుష్ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు, బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు అర్హులైన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఇంక్రిమెంట్లు, లాయల్టీ బోనస్, ప్రసూతి సెలవులు, పారదర్శక బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు..

ప్రభుత్వం కేవలం మాటలు చెప్పడం మాని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో వెంటనే చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.





తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి

రొయ్యపల్లిలో బతుకమ్మ సంబరాలు

కలంజ్యోతి, హన్మూర (అక్టోబర్ 16) : హన్మూర మండల పరిధిలోని రొయ్యపల్లి గ్రామంలో గురువారం తెలంగాణ సాంప్రదాయాల ప్రకారం ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రొయ్యపల్లి సర్పంచ్ పోచ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు బతుకమ్మ పాటలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. మహిళలు సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామస్తులు, మహిళలంతా కలిసికట్టుగా పాల్గొని పండుగ వాతావరణాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రొయ్యపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పోచ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

శుక్రవారం 16.10.2026

www.kalamjyothi.com



కార్మిక బోర్డు అవినీతిపై విచారణ చేపట్టాలి

- సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 16) : భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో జరిగిన భారీ అవినీతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్ డిమాండ్ చేశారు. బీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ కుంభకోణం వెనుక రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి అనుచరుల హస్తం ఉందని ఆరోపించారు. ముంబైకి చెందిన ట్రయల్ బ్లేజర్ ఇన్సూరెన్స్ బ్రోకర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి జీవో నెంబర్ 12 జారీ చేసి 346 కోట్లు చెల్లించారని పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు చైర్మన్, కమిటీ తీర్మానం లేకుండా నిధులు విడుదల చేయడానికి వీలులేదని చట్టంలో ఉన్నప్పటికీ, చైర్మన్ లేని సమయంలో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఎల్ఐసీ, ఎన్‌బీఐ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాదని ప్రైవేటు కంపెనీకి అప్పగించి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రమాద, సహజ మరణాలు, వివాహాలు, ప్రసవాలు వంటి పథకాల లబ్ధి నేరుగా లేబర్ శాఖ ద్వారా కార్మిక కుటుంబాలకు అందేదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన మూడేళ్ల కాలంలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి 500 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్మిక సంక్షేమ నిధుల దోపిడీకి వ్యతిరేకంగా శనివారం నిర్వహించే లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గణిపాక రాజశేఖర్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.



గుర్తింపు లేకుండా అద్దెకిస్తే చర్యలు

- అద్దెదారుల వివరాలు పోలీసులకు అందించాలి
- నేరాల నియంత్రణలో యజమానులదే కీలక పాత్ర

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలు, సరైన గుర్తింపు కార్డులు పరిశీలించిన తర్వాతే ఇళ్లు, గదులు అద్దెకు ఇవ్వాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రాచారి స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకు ఉండేవారి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆధార్ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు సేకరించాలన్నారు. వివరాలను ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందించి, పోలీసు ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయ్యాకే గదులు కేటాయించాలని, పరిచయం ఉందనో లేక ఎక్కువ అద్దె వస్తుందనో నిబంధనలు విస్మరించవద్దని పేర్కొన్నారు.

యజమానులదే కీలక పాత్ర..

గుర్తింపు వివరాలు సేకరించకుండా అద్దెకు ఇళ్లు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డీఎస్పీ హెచ్చరించారు. గ్రామాల్లో లేదా మండల కేంద్రంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, వారి ప్రవర్తనపై అనుమానం వచ్చినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో నేరాలను అరికట్టడం, భద్రత కల్పించడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు సైతం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండి సహకరిస్తే నేరాల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ ఓ.వెంకటేష్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు భూ ఆక్రమణపై చర్యలు

- ప్రహరీ కూల్చివేసి అక్రమ నిర్మాణంపై ఆగ్రహం
- అధికారుల నిర్లక్ష్యంపై పలు అనుమానాలు
- స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీ గోడను కూల్చివేసి అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులను వెంటనే అడ్డుకోవాలని బీజేపీ, కిసాన్ మోర్చా నేతలు డిమాండ్ చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అండదండలతోనే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆరోపించారు. మార్కెట్ యార్డును సందర్శించిన నాయకులు, అక్కడ ప్రైవేటు వ్యక్తి చేపట్టిన పనుల్లో భాగంగా ప్రహరీతో పాటు స్లాబ్‌ను సైతం కూల్చివేసి నిర్మాణం కొనసాగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యంపై పలు అనుమానాలు..

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినా, రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమని నాయకులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నప్పటికీ, ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం..

ఆక్రమణలపై అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయకపోతే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్, తక్కల రమణ రెడ్డి, దొడ్డికింది ముత్యం రెడ్డి, మేడిసేమ్మ రాజు, సాదం అరవింద్,



సామ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపె విలాస్, బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షులు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, నిర్మల్ పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, కౌన్సిలర్లు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదుర్గా కుంకుమ పూజలు

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు
- భక్తులకు అన్నప్రసాద వితరణ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి మండపం ఆవరణలో 150 మంది మహిళలు ఘనంగా భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆరవ వార్షికోత్సవం సందర్భంగా పురోహితులు బ్రహ్మశ్రీ రాచర్ల దయానంద్ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గాదేవికి కుంకుమ పూజలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో దుర్గాదేవి మండపం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

భక్తులకు అన్నప్రసాద వితరణ..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ నంది కిషన్,



ఉమా దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టి సేవాభావాన్ని చాటుకున్నారు. అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండాడి కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఒడ్నాల నరసయ్య, స్థానిక సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఉపసర్పంచ్ బందారపు బాలెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, చెన్ని బాబు, గుండాడి రాంరెడ్డి, బండారి బాలెడ్డి, మేగి నరసయ్య, ఉప సర్పంచ్ జజ్జరీ దేవేందర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు సందుపట్ల లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ దుర్గా భవాని సేవా సమితి ప్రతినిధులు వడ్నాల భాస్కర్, నంది నరేష్, జవాజి సంజీవ్, మీసం హరీష్, బాధ రమేష్, రాజిరెడ్డి సాయి, ప్రణయ్, దేవయ్యల ఆధ్వర్యంలో కుంకుమ పూజ, అన్నప్రసాద కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.

గంజాయి సేవిస్తూ ఇద్దరు పట్టివేత



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 16) : మండల పరిధిలోని వెంకట్రావుపల్లె సమీపంలో ఉన్న అనంత గిరి ప్రాజెక్టు వద్ద గురువారం ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. రోజువారీ పెట్రోలింగ్‌లో భాగంగా వెళ్తున్న పోలీసు సిబ్బందికి రోడ్డు పక్కన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని ఆపి విచారించారు. వారు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. దీంతో వారిని సిరిసిల్లలోని పునరావాస (రిహాబిలిటేషన్) కేంద్రానికి తరలించినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. పట్టుబడిన వారిని చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పిండి అనిల్(25), బండిపల్లి సాయికిరణ్(29)లుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు రెండో ఎస్సై లక్పతి వెల్లడించారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ చాకచక్యంగా నిందితులను పట్టుకున్న హెడ్ కానిస్టేబుళ్లు కొమురయ్య, రమణారెడ్డి, కానిస్టేబుల్ వెల్మశ్రీకాంత్ రెడ్డిలను ఎస్సై అభినందించారు. ఎవరైనా గంజాయి సేవించినా లేక విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 16.10.2026
4
www.kalamjyothi.com

సంస్కృతిని భావితరాలకు అందించాలి

ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ ప్రతీక



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను భావితరాలకు అందించాలని ఎంపీడీవో వెంకట శివానంద్ పిలుపునిచ్చారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని పద్మావతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట శివానంద్, ఏపీఎం తిలక్ గౌడ్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు బతుకమ్మ పాటలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పద్మావతి గ్రామైక్య సంఘం సభ్యులు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు కుసుమ, ఆమని, పద్మావతి సంఘం అధ్యక్షురాలు లక్క కీర్తన, ప్రధాన కార్యదర్శి ముదురు సుగుణ, ఉపాధ్యక్షురాలు కంది పూలమ్మ, కార్యదర్శి మహేశ్వరి, సహాయ కార్యదర్శి నిర్మల, సీసీలు మంజుల, సుజాత, అకౌంటెంట్ రజిత, కంప్యూటర్ ఆపరేటర్ ఉమా, సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలకు రాజ్యాధికారమే పరిష్కారం



కోటి ఎకరాల భూమి పంపిణీ చేస్తాం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 16) : బీసీల సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారమే ఏకైక మార్గమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే కోటి ఎకరాల భూమిని పంపిణీ చేస్తామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ హామీని నమ్మి ఓట్లు వేశామని, కానీ అధికారంలోకి వచ్చాక హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 33 నుంచి 23 శాతానికి తగ్గించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 19 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. బీసీలకు 60 శాతం, ఎస్సీ, ఎస్టీలతో కలిపి 90 శాతం వాటా దక్కాలని డిమాండ్ చేశారు.

బీసీల సంక్షేమానికి 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆ నిధుల వివరాలను వెల్లడించాలని కోరారు. బీసీ విద్యార్థుల ఫీజుల కోసం కేటాయించిన 1,600 కోట్ల రూపాయలతో పాటు చేనేత, కల్లుగీత కార్మికులు, కల్యాణలక్ష్మి నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. తనపై మూడుసార్లు హత్యాయత్నం జరిగిందని పేర్కొన్నారు. బీసీలంతా ఐక్యంగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.



నేడు మూల నక్షత్ర వేడుకలు

బాసరలో భారీ భద్రతా ఏర్పాట్లు

ఎస్పీ జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 15) : నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్ర వారం జరగనున్న మూల నక్షత్ర మహా అక్షరాభ్యాస కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల భద్రత దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టిందని ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు బాసరలో బందోబస్తు విధులకు హాజరైన సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి విధుల నిర్వహణపై బ్రీఫింగ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద భద్రత, నది ప్రవాహ ఉధృతి పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డైసా ఏఎస్పీ సాయి కిరణ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ సింగ్ హత్య కేసు ఛేదన

- **డబ్బుల కోసమే కాంట్రాక్టర్ తీసుకుని హత్య**
- **రైల్వే స్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలింపు**




కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో కలకలం రేపిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసును పోలీసులు కేవలం 14 గంటల్లోనే ఛేదించారు. డబ్బుల కోసమే ఆయనతో కలిసి పనిచేస్తున్న కూలీలు, వరుసకు బావమరిది అయిన రాజస్థాన్‌కు చెందిన జోగిందర్, ఉత్తరాఖండ్‌కు చెందిన శివమ్ కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తేలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్ సింగ్(28) గొల్లపల్లి శాతవాహన కాలనీ సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంలో ఉండగా, 14వ తేదీ మధ్యాహ్నం కూరగాయలు కోసే కత్తితో మెడ, గొంతు కోసి, ఛాతీపై పొడిచి కిరాతకంగా చంపేశారు. అనంతరం తలుపులు వేసి పవన్ ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, క్లూస్ టీమ్ ద్వారా కీలక ఆధారాలు సేకరించారు.

రిమాండ్‌కు తరలింపు..

నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించగా, వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ బృందం నిందితులు జోగిందర్, శివమ్‌లను రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసింది. గురువారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ కత్తురోజు నాగేంద్రచారి వివరాలు వెల్లడిస్తూ నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హత్య జరిగిన కొద్ది గంటల్లోనే కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ద్వారా రివార్డులు అందేలా చూస్తానని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట సీఐ ఓ.వెంకటేష్, ఎస్సై ఎన్.రమేష్ గౌడ్, వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓంకార్ వర్ధంతి విజయవంతం చేయాలి

అసెంబ్లీ టైగర్ ఆశయాలు తీసుకెళ్లాలి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అసెంబ్లీ టైగర్‌గా పేరొందిన ఎంసీపీఐయూ పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేష్ పిలుపునిచ్చారు. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 17న గీసుకొండ మండలం మచ్చాపురం గ్రామంలోని కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ స్తూపం వద్ద 18వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులతో పాటు కళాకారులు, మేధావులు, ప్రజా ఉద్యమకారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఓంకార్ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, సామాజిక న్యాయం, పేదలు, రైతుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషిని నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓంకార్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న వర్ధంతి సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజా ఉద్యమ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని జన్ను రమేష్ కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కొత్త స్వరూప తీవ్ర జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ ఆమె స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వరూప మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆయన ఓదార్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, ఉప సర్పంచ్ కక్కెర్ల రజిత శ్రీను, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బానోత్ వీరన్ననాయక్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బోనగిరి స్వామి, నాయకులు బోనగిరి సారయ్య, బాధావత్ పెద్ద వీరు, బాధావత్ వీరు, ముత్యం భద్రయ్య, పెద్దమ్మల రాజేందర్, బాధావత్ చందర్, తేజావత్ బద్రు, ఈర్ల శ్రీను, ఆకుల అశోక్, వార్డు సభ్యులు ఒంటరి రాజు, తూటి రాణి శ్రీను, బాధావత్ సురేష్, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కాయాజ్ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
శుక్రవారం 16.10.2026
www.kalamjyothi.com



హామీల అమలుపై శ్వేతపత్రం ఇవ్వాలి

- ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- తూడుకుర్తిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంపై ఆగ్రహం

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 16) : కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ మాటలు మానుకొని ఎన్నికల ముందు విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ యువనేత డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు నోటిఫికేషన్ల ద్వారా కేవలం 14 వేల ఉద్యోగాలే భర్తీ చేసిందని ఆరోపించారు. విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు నెలకు 20 వేల రూపాయల ఆర్థిక సాయం వంటి హామీలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు.

తూడుకుర్తిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంపై ఆగ్రహం..

రాష్ట్రంలో రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తమ సొంత భూముల విలువలు పెంచుకునేందుకే తూడుకుర్తిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే పాఠశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు అర్థం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, కౌన్సిలర్ అర్జునయ్య, భీముడు, సత్యం, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, భీమయ్య, రాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్, ఆపరేటర్
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 16) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో వేములవాడ రూరల్ తహసీల్దార్ అబూబాకర్, భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బాధితుడు తన భూ సంబంధిత పని నిమిత్తం గత సెప్టెంబర్‌లో స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాన్ని సంప్రదించగా, వివిధ కారణాలు చూపుతూ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టారు. ఆ పని పూర్తి చేయాలంటే 10 వేల రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, బాధితుడు తన వద్ద అంత మొత్తం లేదని చెప్పి 8 వేల రూపాయలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు.

బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ..

లంచం డిమాండ్ వ్యవహారంపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు పక్కా వ్యూహంతో వలపన్నారు. తహసీల్దార్ అబూబాకర్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ అనిల్ బాధితుడి నుంచి 8 వేల రూపాయలు తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన అధికారులు లంచాలు డిమాండ్ చేయడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతుండగా, ఈ ఘటన జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

నర్సంపేట అభివృద్ధికి భారీ నిధులు

- సమగ్రంగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు
- నీటిపారుదల వనరుల మెరుగుదలకు ప్రాధాన్యం



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 16) : నర్సంపేట నియోజకవర్గ పరిధిలో పాఖాల్ అభివృద్ధితో పాటు చిన్న నీటిపారుదల చెరువుల పునరుద్ధరణకు సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ ప్రతిపాదనలపై చర్చించారు. పాఖాల్ అభివృద్ధికి 150 కోట్ల రూపాయలు, నియోజకవర్గంలోని 47 చిన్న నీటిపారుదల చెరువుల అభివృద్ధికి 100 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పనులకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

నీటిపారుదల వనరుల మెరుగుదలకు ప్రాధాన్యం..

వర్షపు నీటి సంరక్షణ, సాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద చేపట్టే పనుల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి అమలు చేయాలన్నారు. నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచి పాఖాల్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కృపాకర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్, సీజీడబ్ల్యూడీ అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ తారిఖ్, నర్సంపేట ఆర్డీవో, డీఆర్‌డీఏ పీడీ, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ సంగీత పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలకు అంకితభావం అవసరం

- హాజరుతోనే విద్యావ్యవస్థ మరింత బలోపేతం
- గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అభ్యాస దీపిక రూపకర్తకు ప్రశంసలు



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 16) : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడిన ఆయన, ఉపాధ్యాయులు, విద్యార్థుల క్రమం తప్పని హాజరుతోనే ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యాలను పెంపొందించేలా తరగతి గది బోధన సాగాలని సూచించారు.

గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

పాఠశాలలకు తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలను తెలుసుకోవాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. వారు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో సిద్ధం చేయాలని నిర్దేశించారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు.

అభ్యాస దీపిక రూపకర్తకు ప్రశంసలు..

విద్యార్థుల కోసం అభ్యాస దీపిక వెబ్‌సైట్ రూపకల్పన చేసిన ప్రధానోపాధ్యాయుడు మునిందర్ రాజును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠాలు, మెళకువలు, అభ్యాస విధానాలను సులభంగా అర్థమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఇలాంటి వినూత్న ఆలోచనలతో మరింత మంది ఉపాధ్యాయులు ముందుకొచ్చి విద్యాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన, హక్కులపై అవగాహన అవసరం



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 16) : చెన్నారావుపేట మండలంలోని బాపునగర్ తండాలో గురువారం సీపీఎఫ్‌బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కుటుంబ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తూ, వ్యవసాయ రంగంలోనూ కీలక పాత్ర పోషిస్తున్న గ్రామీణ మహిళలు తమ హక్కుల సాధనలో ముందంజలో ఉండాలని సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ (సీపీఎఫ్), బెటర్ కాటన్ ఇనిషియేటివ్ (బీసీఐ) ప్రాజెక్టు పీయూ మేనేజర్ ఉదయ్ కిరణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుర్చీల ఆట, నృత్యాలు, పాటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ రామ్ చందర్ నాయక్, ఉపసర్పంచ్ ఈరమ్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో పరస్పర సహకారాన్ని, ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శారద, రమణి, ఏఈఓ కిరణ్మయి, శ్రీనివాస్, జిన్నర్ రాజారెడ్డి, సీపీఎఫ్‌బీసీఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్లు తిరుపతి, సంతోష్, సందీప్, రమేష్, గణేష్, రాజు, ఈర్య, శివరాజ్, కుమారస్వామి, శృతి, ప్రియాంక, తండా మహిళలు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 16.10.2026



భక్తిశ్రద్ధలతో బాగులవాడలో బోనాల సమర్పణ





- దుర్గానామస్మరణతో మార్మోగిన వీధులు
- శివసత్తుల నృత్యాలతో ఆధ్యాత్మిక శోభ

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 15) : నిర్మల్ పట్టణంలోని బాగులవాడలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ లలితా త్రిపురసుందరి అమ్మవారి అవతారాన్ని పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి అమ్మవారిని భక్తిప్రపత్తులతో ప్రార్థించారు. భాజాభజంత్రీలు, దుర్గానామస్మరణలు, భక్తుల నృత్యాలతో బాగల వాడ వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉత్సవ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసింది. మహిళలు సంప్రదాయబద్ధంగా ఈబోనాలు ఎత్తుకొని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. దారి పొడవునా అమ్మవారిని స్మరిస్తూ, భక్తిపారవశ్యంతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తులు వేసిన సిందులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాగలవాడకు చెందిన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గానామస్మరణతో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్యులు, పురోహితులు ఇందూర్తి ఆచార్య కళ్యాణ్ మాట్లాడుతూ బోనాల సమర్పణలోని ఆధ్యాత్మిక అంతరార్థాన్ని వివరించారు. బోనం అనేది కేవలం నైవేద్యం మాత్రమే కాదని, అమ్మవారిపై భక్తి, కృతజ్ఞత, విశ్వాసాలకు ప్రతీక అని పేర్కొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ భవేష్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 15) : దసరా పండుగ సందర్భంగా కలెక్టరేట్ లో గురువారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా బతుకమ్మలకు పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో పూల బతుకమ్మలను పేర్చి, ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వీరితో పాటుగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా లయబద్ధంగా బతుకమ్మ ఆడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటే ప్రకృతి, వ్యవసాయం, రైతులతో మమేకమై ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురిసి,ల రైతులు అన్ని సమస్యల నుంచి బయటపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు రైతులకోసం ప్రార్థించాలని కోరారు. జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ బతుకమ్మవేడుకల్లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఖజానా శాఖ అధికారి సరోజ, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యం

పట్టభద్రుల ఓటర్లను చైతన్యపరచాలి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 15) : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ఎన్నికల కార్యాచరణ, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఓటర్లను చైతన్యపరచడంతో పాటు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, శ్రేణులు తరలివచ్చి అభ్యర్థి విజయానికి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.





ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 16) : నర్సంపేట పట్టణంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు గాంధీనగర్‌లో జనతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, 20వ వార్డు కౌన్సిలర్ శ్రీరామోజు రోజారాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందించగా, మహిళలు శాలువాతో సత్కరించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న యూత్ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ ఇస్లావత్ రామాగోపి నాయక్, ఫైండ్ల పవన్, బూస స్నేహిత్, కొండోజు చరణ్, కొల్లూరి రాజు, కొల్లూరి భరత్, కొండోజు సురేష్, సాంబరాజు సుమన్, హరిదాస్యం స్వాతి, తోగిటి సృజన, అడ్డూరి స్వర్ణలత, తెలంగాణ రజిత, కొల్లూరి సిరి పాల్గొన్నారు.

కల్లూరు సర్పంచ్, ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 15) : నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ల చెక్ పవర్ ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ భవేష్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.5,85,933 గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ కుటుంబ సభ్యుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించడం జరిగిందని, రూ.1,85,043 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడాన్ని విచారణ నివేదిక ద్వారా గుర్తించామన్నారు. గ్రామసభ ముందస్తు అనుమతి లేకుండా, కొటేషన్లు, టెండర్ నిబంధనలు పాటించకుండా పనులు చేపట్టడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టామన్నారు. విచారణలో అవకతవకలు రుజువు కావటంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు.



బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

మహిళలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 16) : నర్సంపేట పట్టణంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్‌తో కలిసి పట్టణంలోని అంగడి మైదానంతో పాటు పలు వార్డుల్లోని బతుకమ్మ ఆట స్థలాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి, పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా మైదానాలను శుభ్రంగా ఉంచాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వేడుకలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య జరిగేలా అన్ని చర్యలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బీరం భరత్‌రెడ్డి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్, రాయిడి కీర్తి దుష్యంత్‌రెడ్డి, మండల శ్రీదేవి శ్రీనివాస్, 4వ వార్డు అధ్యక్షుడు మంచినీళ్ల నాగరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కందిక స్వామి, జవాన్ రమేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

బోల్డ్ సీక్వెల్‌లో తమన్నా?

భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బోల్డ్ బయోపిక్ ది డర్టీ పిక్చర్ చిత్రానికి దాదాపు పదిహేనేళ్ల తర్వాత సీక్వెల్ రాబోతోందని నిర్మాత ఏక్తా కపూర్ అధికారికంగా ప్రకటించగా, ప్రధాన పాత్ర కోసం మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, తృప్తి దిమ్రి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈ రెండో భాగం సిల్క్ స్మిత ప్రయాణం కాదని, సమాజపు కట్టుబాట్లను ఎదురించి నిలిచిన మరో పవర్‌ఫుల్ మహిళ వ్యక్తిగత స్వేచ్ఛ, పోరాటాల చుట్టూనే కథ తిరుగుతుందని చిత్రబృందం స్పష్టం చేసింది. మొదటి భాగంలో విద్యాబాలన్ అద్భుత నటనతో సరికొత్త బెంచ్‌మార్క్ సృష్టించిన నేపథ్యంలో, ఒకవేళ తమన్నా ఈ అవకాశం దక్కించుకుంటే ఆ స్థాయి ఇంటెన్సిటీని అందుకోవడం ఆమె కెరీర్‌కే పెద్ద సవాలుగా మారనుండగా, నటీనటులు, దర్శకుడి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.